## స్పీకర్‌గా శ్రీనివాసరెడ్డిది సరికొత్త చరిత్ర

- సెంటిమెంట్‌ను తిప్పికొట్టి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపు

నిజామాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి సరికొత్త చరిత్రను లిఖించారు. ఇప్పటి వరకు స్పీకర్‌గా పని చేసిన వారందరూ తదుపరి ఎన్నికల్లో తిరిగి గెలవరనే సెంటిమెంట్‌ను శ్రీనివాసరెడ్డి బద్దలుకొట్టారు. శాసన సభాపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే పోచారం తాజా ఎన్నికల ఫలితాల్లో చారిత్రాత్మకమైన విజయాన్ని నమోదు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలు ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు పనిచేసిన ఏ ఒక్క అసెంబ్లీ స్పీకర్ తర్వాతి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించలేదు. దీంతో సభాపతులకు పదవీగండం తప్పదనే సెంటిమెంట్ ఉండేది. ఇప్పుడా సెంటిమెంట్‌ను తిప్పికొడుతూ పోచారం బాన్సువాడలో ఘన విజయం సాధించి చరిత్రను తిరగరాశారు. తన రాజకీయ జీవితంలో మొత్తం 8 సార్లు పోటీ చేసిన పోచారం.. ఏడుసార్లు గెలుపొందారు. 2004లో ఒక్కసారి మాత్రమే ఓడిపోయారు. మూడు పర్యాయాలు మంత్రిగా, ఒకసారి శాసన సభాపతిగా పని చేసిన రికార్డు ఆయన సొంతం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి క్యాబినెట్‌లో తొలి వ్యవసాయ శాఖ మంత్రిగానూ పోచారం శ్రీనివాసరెడ్డి ఘనతను దక్కించుకున్నారు. 2018లో రెండోసారి ఏర్పాటైన ప్రభుత్వంలో స్పీకర్‌గా విధులు నిర్వర్తించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసేవకే అంకితమైన పోచారం శ్రీనివాసరెడ్డి జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నది.



రిటర్నింగ్ అధికారి నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పోచారం శ్రీనివాసరెడ్డి

## ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం: హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తామని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్‌కు అవకాశమిచ్చిన ప్రజలు.. ఈసారి కాంగ్రెస్‌ను ఆదరించారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ పాలన సాగాలని ఆకాంక్షించారు. ఎన్నికల సమరంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతుగా రేయింబవళ్లు శ్రమించిన పార్టీ శ్రేణులకు, ఆదరించిన ప్రజలకు హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అధికారంలో లేకున్నా ప్రజాసేవకు అంకితం: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): అధికారం ఉన్నా లేకున్నా తాము తెలంగాణ సేవకులమన్నది మరిచిపోవద్దని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిందుకు బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులకు, సోషల్ మీడియా వారియర్స్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మన మాతృభూమి కోసం చిత్తశుద్ధితో పనిచేద్దామని ఆమె ట్వీట్ చేశారు. కోరుట్ల నియోజకవర్గం (ఇక్కడ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌పై బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ గెలుపొందారు) ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 2% ఓట్ల తేడాతో 25 సీట్లు గల్లంతు

- బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్‌కు 4.78 లక్షల ఓట్లు అధికం
- నోటాకు పడిన ఓట్లు 1.71 లక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ బీఆర్‌ఎస్ పార్టీల మధ్య ఓట్ల తేడా కేవలం 2.04 శాతంగా ఉన్నది. ఓట్ల పరంగా చూస్తే బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్‌కు 4,78,379 ఓట్లు అధికంగా పడ్డాయి. దీంతో ఆ పార్టీ బీఆర్‌ఎస్ కన్నా 25 సీట్లు అధికంగా గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ పార్టీకి 39.40 శాతం ఓట్లు రాగా, బీఆర్‌ఎస్‌కు 37.35 శాతం ఓట్లు వచ్చాయి. సీట్ల పరంగా అయితే సీపీఐతో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్‌కు రెండు పార్టీల ఓట్లు కలిపితే 39.69 శాతంగా ఉన్నాయి. బీజేపీకి 13.89 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీకి గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే 6.91 శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ కూడా ఈ సారి గణనీయంగా ఓట్లను పెంచుకున్నది. అనూహ్యంగా నోటాకు 1,71,884 ఓట్లు పడ్డాయి.

### ఓట్లు, ఓట్ల శాతం వివరాలు

| పార్టీ | పొందిన ఓట్లు (2018) | శాతం (2018) | పొందిన ఓట్లు (2023) | శాతం (2023) |
|---|---|---|---|---|
| బీఆర్‌ఎస్ | 97,00,948 | 46.87 | 87,51,391 | 37.35 |
| కాంగ్రెస్ | 58,83,088 | 28.43 | 92,33,784 | 39.40 |
| బీజేపీ | 14,43,799 | 6.98 | 32,56,130 | 13.89 |
| ఎంఐఎం | 5,61,091 | 2.71 | 5,19,047 | 2.22 |
| సీపీఐ | 83,215 | 0.40 | 80,336 | 0.34 |
| సీపీఎం | 91,099 | 0.44 | 52,364 | 0.22 |
| నోటా | 2,24,661 | 1.09 | 1,71,884 | 0.73 |
| బీఎస్పీ | 4,26,203 | 2.06 | 3,21,047 | 1.37 |
| ఏఐఎఫ్‌బీ | 1,59,515 | 0.77 | 1,46,128 | 0.62 |
| ఇతరులు | ---- | ----- | 9,00,724 | 3.84 |



తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మధుసూదనాచారి, నాయకులు బాల్క సుమన్, దాసోజు శ్రవణ్, కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

# ప్రజాతీర్పును శిరసావహిస్తాం

మొదటిపేజీ తరువాయి...

బాగా కష్టపడ్డారని, పార్టీ కార్యకర్తలు, నాయకుల కృషి వల్లనే 39 సీట్లు గెలిచామని అన్నారు. గతంలో కంటే ఎక్కువ సీట్లు వస్తాయని ఆశించామని, సీట్లు తక్కువగా రావడానికి కారణాలపై సమీక్షించుకుంటామని స్పష్టంచేశారు. గత పదేండ్లుగా ప్రభుత్వాన్ని ఎంత సమర్థంగా నడిపించామో.. ప్రతిపక్షంగా కూడా అంతే సమర్థంగా పనిచేస్తామని చెప్పారు. ఎదురుదెబ్బలను గుణపాఠంగా తీసుకొని నేర్చుకోవాల్సినవి నేర్చుకొని ముందుకు పోతామని స్పష్టం చేశారు. 23 ఏండ్లలో ఎన్నో ఎదురుదెబ్బలు తగిలాయని, ఎత్తు పల్లాలు అన్నీ చూశామని వివరించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అనే లక్ష్యాన్ని సాధించామని, ఇప్పటివరకు చేసిన పని పట్ల సంతృప్తి ఉన్నదని పేర్కొన్నారు. అడుగడుగునా అండగా ఉన్న కార్యకర్తలకు, నాయకులకు, పదేండ్లుగా సహకరించిన ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

**గెలుపు, ఓటములు సహజం**

రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని కేటీఆర్ పేర్కొన్నారు. స్థితప్రజ్ఞత అనేది రాజకీయాల్లో చాలా అవసరమని, గెలుపునైనా, ఓటమినైనా ఒకే రకంగా తీసుకోగలిగే ధీరోదాత్తత కేసీఆర్ తమకు నేర్పించారని చెప్పారు. కొంత బాధ ఉంటదని, బాధను దిగమింగి, గోడకు కొట్టిన బంతి ఎంత వేగంగా వెనక్కి వస్తదో అంతే వేగంతో వెనక్కి వచ్చినట్టుగా ప్రజల మన్ననలను తిరిగి పొందే విధంగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గతంలో చేసిన దాని కంటే రెట్టింపు కష్టం చేస్తామని చెప్పారు. ఎవ్వరూ నిరాశకు లోనుకావాల్సిన, బాధపడాల్సిన, అధైర్యపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఇలాంటివి జీవితంలో, రాజకీయాల్లో సర్వసాధారణమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇచ్చారని, ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వాన్ని బాగా నడపాలని మనసారా కోరుకుంటున్నామని చెప్పారు. కొత్త ప్రభుత్వాన్ని తొందర పెట్టే పని కూడా చేయబోమని, వారు ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నామని అన్నారు. ప్రజల పక్షాన, ప్రజల గొంతుగా, మరింత దృఢ సంకల్పంతో పనిచేస్తామని, కాంగ్రెస్ హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాడుతామని చెప్పారు.

### పోరాట స్ఫూర్తితో..

ఎన్నికల ఫలితాలు స్పీడ్ బ్రేకర్‌లు మాత్రమేనని, చిన్న ఎదురుదెబ్బ మాత్రమేనని కేటీఆర్ చెప్పారు. కొందరు మంత్రులు అనూహ్యంగా ఓటమిపాలయ్యారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ అన్ని సర్వశక్తులు ఒడ్డి పోరాటం చేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమీక్షలు, చిన్న మార్పులు, చేర్పులు చేసుకోవాల్సి ఉంటే చేసుకుందామని చెప్పారు. ఆనాడు ఎన్ని ప్రతికూలతల మధ్య ఉద్యమాన్ని నడిపామో మళ్లీ అదే రకమైన పోరాట స్ఫూర్తితో ధైర్యంగా ముందుకు పోదామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ శాసనసభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలు ప్రతి జిల్లాలో ప్రాతినిధ్యం కల్పించారని అన్నారు. ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజాతీర్పు శిరోధార్యం కాబట్టి ప్రజాస్వామ్య ప్రక్రియలో పరిణతి ప్రదర్శించి కేసీఆర్ తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు పంపించారని తెలిపారు. ఎన్నికల ఫలితాలు చూస్తే.. వేవ్ లాగా లేదని, రాష్ట్రం అంతా ఒకేరకమైన ఫలితాలు రాలేదని, గ్రేటర్ హైదరాబాద్, మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఏకపక్షంగా తీర్పు ఇచ్చారని చెప్పారు. దేవరకద్ర, తాండూరు, ఖానాపూర్‌లాంటి కొన్నిచోట్ల చాలా స్వల్ప మెజార్టీతో ఓడిపోయామని వివరించారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కానీ సింగరేణికి గాని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసినంతగా ఎవ్వరు చేయలేదని, బోనస్, వారసత్వ ఉద్యోగాలు ఇచ్చామని, ప్రైవేటీకరణను అడ్డుకున్నామని, కానీ అక్కడ కాంగ్రెస్ పార్టీకి అసాధారణమైన మెజార్టీ వచ్చిందని చెప్పారు. పార్టీ నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలతో మాట్లాడి ఓటమికి కారణాలను విశ్లేషిస్తామని తెలిపారు.

## గజ్వేల్‌లో కేసీఆర్ హ్యాట్రిక్

- వరుసగా మూడోసారి గెలిచిన మరికొందరు నేతలు



హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో గజ్వేల్ నుంచి పోటీచేసి విజయం సాధించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అరుదైన ఘనత సాధించారు. గజ్వేల్ నుంచి కేసీఆర్‌కు ఇది వరుసగా మూడో గెలుపు. 1985 నుంచి 2004 వరకు సిద్దిపేట నుంచి కేసీఆర్ ఆరు ఎన్నికల్లో గెలుపొందారు. ఇప్పుడు గజ్వేల్ నుంచి వరుసగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ నమోదు చేశారు. ఈ గెలుపుతో మూడో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుని హ్యాట్రిక్ సాధించిన నేతల్లో.. గోషామహల్ నుంచి రాజాసింగ్, శేరిలింగంపల్లిలో అరికెపూడి గాంధీ, జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపినాథ్, సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి, కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు, సికింద్రాబాద్‌లో పద్మారావు, సనత్‌నగర్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానంద్, మధిరలో భట్టి విక్రమార్క, హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కార్వాన్‌లో కౌసర్ మొహియుద్దీన్, మేరాజ్ జాఫర్ హుస్సేన్ (రెండుసార్లు నాంపల్లి, ఈ దఫా యాకత్‌పుర) నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. పటాన్‌చెరులో గూడెం మహిపాల్‌రెడ్డి, చేవెళ్ల నుంచి కాలే యాదయ్య వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ నమోదు చేశారు.

### సీఎం కేసీఆర్ రాజీనామాకు ఆమోదం

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆదివారం సాయంత్రం కేసీఆర్ తన రాజీనామా లేఖను గవర్నర్‌కు పంపారు. ఆ వెంటనే గవర్నర్ దానిని ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కేసీఆర్‌ను కోరినట్టు పేర్కొంటూ గవర్నర్ కార్యదర్శి సురేంద్ర మోహన్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

### చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 15.9°c | 32.1°c |
| రంగారెడ్డి | 16.2°c | 32.3°c |
| మెదక్ | 16.8°c | 33.1°c |
| నిజామాబాద్ | 19.5°c | 31.5 °c |
| హైదరాబాద్ | 20.6°c | 30.2°c |
| నల్లగొండ | 21.2°c | 34.6°c |
| మహబూబ్‌నగర్ | 21.5°c | 31.2°c |
| వరంగల్ | 22.0°c | 31.0°c |
| కరీంనగర్ | 22.0°c | 31.0°c |
| ఖమ్మం | 23.0°c | 29.0°c |

### నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఉంటాం

- కీలక నేతలు ఓడిపోవడం దురదృష్టకరం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కామారెడ్డి, డిసెంబర్ 3: ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను గౌరవిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కామారెడ్డిలో మీడియాతో మాట్లాడారు. గెలిచిన 8 మంది ఎమ్మెల్యేలతో త్వరలో సమావేశమై, భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామని పేర్కొన్నారు. తమ పార్టీ కీలక నేతలు ఓడిపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. తాము నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి పెద్ద విజయం దక్కిందని, ఆ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయాలని సూచించారు. పలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను ఓడించామని, వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ఇవి సెమీఫైనల్‌గా భావిస్తున్నట్టు చెప్పారు. 3 రాష్ట్రాల్లో బీజేపీ గెలవటం సంతోషకరమని, ఇదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కామారెడ్డి నుంచి ఎమ్మెల్యే గెలుపొందిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

## హుందాగా వైదొలగిన కేసీఆర్

మొదటిపేజీ తరువాయి...

కోరారు. తర్వాత మధ్యాహ్నం మూడు- మూడున్నర గంటల ప్రాంతంలో ప్రగతిభవన్ నుంచి బయటకు వచ్చారు. ఆ సమయంలో సీఎం సీఎస్‌వో (సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్) కేసీఆర్ దగ్గరికి రాబోతుండగా వద్దని సైగ చేశారు. తాను తన నియోజకవర్గానికి వెళ్తున్నానని, నియోజకవర్గంలోని తన నివాసానికి వెళ్లే క్రమంలో తనకు కాన్వాయ్ అవసరం లేదని, ట్రాఫిక్ క్లియరెన్స్ విషయంలో ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్‌ను 'బండి తియ్' అని చెప్పి ఎలాంటి భద్రత వెంట రాకుండా ఎంపీ వాహనంలో ఎక్కి ప్రగతిభవన్ నుంచి ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలోని తన నివాసానికి బయలుదేరారు. వాహనంలో ముందు ఎంపీ సంతోష్‌కుమార్, వెనక సీట్లో కేసీఆర్ మాత్రమే ఉన్నారు. ఆ వాహనం వెనుక గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మరో వాహనంలో కేసీఆర్ ప్రయాణిస్తున్న వాహనాన్ని అనుసరించారు. గన్‌మెన్లను కూడా కేసీఆర్ వెంట రానీయలేదు.

**రాజీనామా చేసిన తర్వాత**

సీఎం పదవికి రాజీనామా చేసినా మరో ప్రభుత్వం ఏర్పడేవరకు ఆపద్ధర్మ ప్రభుత్వాధినేతగా వ్యవహరించాలని కేసీఆర్‌ను గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ కోరారు. నిజానికి జనవరి 16 వరకు కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉండొచ్చు. ఈ క్రమంలోనే సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముందుగా నిర్ణయం తీసుకొన్నారు. కానీ, ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడిన తర్వాత ఏర్పడబోయే నూతన ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రగతిభవన్ నుంచి తన నియోజకవర్గానికి వెళ్లిపోయారు. ప్రగతిభవన్ నుంచి బయలుదేరిన కేసీఆర్ కాన్వాయ్ లేకుండా, ఎలాంటి దర్పాన్ని ప్రదర్శించకుండా అత్యంత సాధారణ పౌరుడిలా పయనం అయ్యారు. ప్రగతి భవన్ నుంచి ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం వరకు ఎన్ని ట్రాఫిక్ సిగ్నల్స్ వస్తే అన్ని చోట్లా సగటు తెలంగాణ పౌరుడిగా ఆగుతూ హుందతనాన్ని చాటుకొన్నారు.

### చరితార్థ పాలన.. ఆదర్శ రాజకీయం

తెలంగాణ ఉద్యమ సమయంలో వీరోచిత నాయకుడు.. పాలనలో దార్శనికుడు.. రాష్ట్ర సాధన అనంతరం రెండుసార్లు దాదాపు పదేండ్లు ముఖ్యమంత్రిగా తెలంగాణ పేరును ప్రపంచాన సగర్వంగా నిలిపిన నేత.. ఆయనే బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్. పాలకులు ఎవరైనా కేసీఆర్ వేసిన రోడ్‌మ్యాప్ నుంచి పక్కకు జరగలేని అనివార్యతలను సృష్టించారు. ప్రజా ప్రతినిధులు తన పార్టీ వాళ్లు అయినా.. విపక్ష పార్టీలవారైనా ప్రజలందరూ తనవాళ్లుగా భావించి చరితార్థపాలన అందించారు. తెలంగాణ తల్లి గర్వించే బిడ్డగా అటు ఉద్యమంలో.. ఇటు పాలనలో ట్రెండ్‌సెట్ చేసిన నాయకుడిగా కేసీఆర్ దేశరాజకీయాల్లో అత్యంత పరిపక్వత కలిగిన నాయకుడిగా అనిర్వచనీయమైన సంతకం చేశారు. ఆదివారం ఎన్నికల ఫలితాల సరళిని పరిశీలించిన అనంతరం ప్రగతిభవన్ నుంచి తన నియోజకవర్గానికి అత్యంత సాధారణ పౌరుడిలా వెళ్లిపోయిన కేసీఆర్ రాజకీయాల్లో అందరికీ ఆదర్శంగా నిలిచారు.

నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### ఈసీఐఎల్‌లో...

ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 33
- పోస్టులు: ప్రాజెక్ట్ ఇంజినీర్, టెక్నికల్ ఆఫీసర్
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీ: డిసెంబర్ 8
- వెబ్‌సైట్: https://www.ecil.co.in

### ఎన్ఐఈపీఐడీలో...

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ (ఎన్ఐఈపీఐడీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 46
- పోస్టులు: లెక్చరర్ స్పెషల్ ఎడ్యుకేషన్, రిహాబిలిటేషన్ ఆఫీసర్, ఎంటీఎస్, డ్రైవర్, స్టాటిస్టికల్ అసిస్టెంట్ తదితరాలు
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 18
- వెబ్‌సైట్: https://www.niepid.nic.in

### హెచ్ఏఎల్‌లో...

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 7
- పోస్టులు: సేఫ్టీ ఆఫీసర్, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్, ఇంజినీర్
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 10
- వెబ్‌సైట్: www.hal-india.co.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఫిజిక్స్ (గ్రూప్స్, డీఎస్సీ), ఐఐటీ నీట్ ఫౌండేషన్ కెమిస్ట్రీ, ఇంగ్లిష్ గ్రామర్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# సిటీ ఓటు ప్రగతికే

మొదటిపేజీ తరువాయి...

బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఏకంగా 17 చోట్ల విజయాన్ని నమోదు చేశారు. జిల్లాల్లో దూసుకుపోయిన కాంగ్రెస్ మాత్రం ఇక్కడ కేవలం 4 స్థానాలకే పరిమితం కాగా.. మజ్లిస్ ఏడు చోట్ల, బీజేపీ ఒక చోట తమ సిట్టింగ్ స్థానాలను మాత్రం కాపాడుకొన్నాయి.

**అభివృద్ధి ఎజెండాగా తీర్పు**

ప్రతిసారిలాగే హైదరాబాద్ మహానగరంలోని ఓటర్లు అభివృద్ధి ఎజెండాగా ఎన్నికల తీర్పు ఇచ్చారు. ఆనవాయితీగానే పనిచేసిన పార్టీవైపు మొగ్గు చూపారు. 2014 ఎన్నికలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ 15 నియోజకవర్గాలు, ఉమ్మడి రంగారెడ్డిలోని 14 నియోజకవర్గాలు.. మొత్తం 29 నియోజకవర్గాల్లో సుమారు 93,03,448 మంది ఓటర్లు ఉండగా.. 50,53,181 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. అంటే 54.31శాతం పోలింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ కేవలం నాలుగు స్థానాలు మాత్రమే కైవసం చేసుకొన్నది. తెలుగుదేశం పార్టీ 11, కాంగ్రెస్ రెండు, బీజేపీ ఐదు స్థానాల్లో గెలవగా... మజ్లిస్ ఏడు స్థానాలను గెలుచుకొన్నది. ఓట్ల వాటా చూస్తే.. బీఆర్‌ఎస్ 22.57 శాతం, టీడీపీ 20.90 శాతం, కాంగ్రెస్ 16.81 శాతం, బీజేపీ 12.39 శాతం, మజ్లిస్ 15.53 శాతంగా ఉన్నాయి.

**నాలుగున్నరేండ్లలో గణనీయమైన అభివృద్ధి**

తెలంగాణ ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటి నాలుగున్నరేండ్లలో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. దీంతో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు గులాబీ పార్టీకి బ్రహ్మరథం పట్టారు. ఆ ఎన్నికల్లో 29 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓట్ల వర్షం కురిసింది. ఆ ఎన్నికల్లో 29 నియోజకవర్గాలకుగానూ 1,28,10,212 మంది ఓటర్లు ఉండగా... కేవలం 40.13 శాతం పోలింగ్ నమోదుతో 51,41,420 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఈ ప్రజా తీర్పులో బీఆర్‌ఎస్ పార్టీ ఏకంగా 19 స్థానాలను కైవసం చేసుకొన్నది. ఆ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 41.26 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ కేవలం రెండు స్థానాలకు మాత్రమే పరిమితం కాగా.. 19.80 శాతం ఓట్లు వచ్చాయి. బీజేపీ కేవలం ఒకే ఒక్క స్థానానికి పరిమితమై తన ఓటు శాతాన్ని 12.15 శాతంగా నమోదు చేసుకొన్నది. మజ్లిస్ తన ఏడు స్థానాలను నిలుపుకొని 9.05 శాతం ఓట్లను సాధించింది. దీనిని బట్టి అభివృద్ధి ఓటర్లను ఆకట్టుకున్నదని అర్థం చేసుకోవచ్చు.

**అభివృద్ధిపై పెరిగిన అవగాహన**

గతంతో పోలిస్తే హైదరాబాద్ మహానగరవాసుల్లో అభివృద్ధి పట్ల అవగాహన, సామాజిక స్పృహ గణనీయంగా పెరిగింది. జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు రావడం, మౌలిక వసతులు భారీగా వచ్చి వాటి ఫలాలు కండ్లారా చూడటంతో నగర ప్రజలు అభివృద్ధికి ఆకర్షితులయ్యారు. సోషల్ మీడియాలో ఇతర నగరాల పరిస్థితి కూడా క్షణాల్లో తెలవడం, నగరాల మధ్య అభివృద్ధిపై బేరీజులు.. తద్వారా చర్చలు జరగడంతో ప్రభుత్వాల పని తీరు ఎలా ఉండాలి? అభివృద్ధితో జీవన ప్రమాణాలు ఎలా పెరుగుతాయనే విషయం సామాన్యుడికి సైతం అర్థమైంది. ఈ నేపథ్యంలో తొమ్మిదిన్నరేండ్లుగా హైదరాబాద్ మహా నగరాభివృద్ధి.. అదే తరుణంలో పొరుగున ఉన్న రాష్ట్రాల్లోని నగరాల పరిస్థితి.. అందునా బెంగళూరు నగరంలో మౌలిక వసతుల కల్పన లేక ఎలా డీలా పడిందనే వివరాలు అందరి స్పృహలో ఉన్నాయి. దీంతో రాజకీయాంశాల కంటే అభివృద్ధి అనేది ప్రజల్లో ప్రధాన ఎజెండాగా మారింది. అదే ఎన్నికల్లోనూ ఓటర్లను ప్రభావితం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో 29 నియోజకవర్గాల్లో ప్రజా తీర్పు కూడా తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి అద్దం పట్టేలా ఉన్నది. దీంతో మహానగర ఓటర్లు తిరిగి మరోసారి గులాబీ పార్టీని భారీస్థాయిలో ఆదరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 29 స్థానాలకుగానూ 17 స్థానాలను కైవసం చేసుకొన్నది. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి మొగ్గు కనిపించినా.. మహానగర ఓటర్లు మాత్రం బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలిచారు. బీజేపీ తిరిగి అదే స్థానాన్ని నిలుపుకొన్నది. మజ్లిస్ తన ఏడు స్థానాలను కాపాడుకొన్నది. కాంగ్రెస్ మాత్రం మునుపటికంటే రెండు స్థానాలను అదనంగా గెలుచుకొని నాలుగు స్థానాలను తన ఖాతాలో వేసుకొన్నది. ఓట్ల శాతం పరిశీలిస్తే.. ఈ ఎన్నికల్లో 29 నియోజకవర్గాల్లో సుమారు 1.11 కోట్ల ఓటర్లకుగానూ 54.15 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఆదివారం రాత్రి వరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు ఇంకా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో 28 స్థానాల్లో బీఆర్‌ఎస్ 39.57 శాతం ఓట్లు సాధించగా... కాంగ్రెస్ 29.97 శాతం, బీజేపీ 19.99 శాతం ఓట్లు పొందింది. మజ్లిస్ 8.77 శాతం ఓట్లను సాధించుకొన్నది.


సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన పద్మారావుగౌడ్ విజయోత్సవ ర్యాలీ

### ఇదీ మూడు ఎన్నికల ముఖచిత్రం

| సంవత్సరం | బీఆర్‌ఎస్ (ఓట్ల శాతం) | కాంగ్రెస్ (ఓట్ల శాతం) | బీజేపీ (ఓట్ల శాతం) | మజ్లిస్ (ఓట్ల శాతం) | టీడీపీ (ఓట్ల శాతం) |
|---|---|---|---|---|---|
| 2014 (29 స్థానాలు) | 04 (22.57) | 02 (16.81) | 05 (12.39) | 07 (15.53) | 11 (20.90) |
| 2018 (29 స్థానాలు) | 19 (41.26) | 02 (19.80) | 01 (12.15) | 07 (9.05) | - |
| 2023 (29 స్థానాలు) | 17 (39.57) | 04 (27.97) | 01 (19.99) | 07 (8.77) | - |

(ఓట్ల శాతం జూబ్లీహిల్స్ ఫలితాలను మినహాయించి...)

### రాష్ట్రంలో తప్పిన ఉప ఎన్నికలు

- కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఓటమి
- గజ్వేల్, హుజూరాబాద్‌లో ఈటల పరాజయం
- వీరిలో ఏ ఒక్కరు 2 చోట్ల గెలిచినా ఎన్నిక తథ్యం

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈసారి ఉప ఎన్నికలకు అవకాశం లేకుండా పోయింది. బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో పోటీకి దిగారు. దీంతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్‌తో పాటు కామారెడ్డిలోనూ పోటీ చేశారు. మరోవైపు బీజేపీ నుంచి ఈటల రాజేందర్ హుజూరాబాద్‌తోపాటు గజ్వేల్‌లోనూ కేసీఆర్‌పై పోటీకి దిగారు. ఈ నేపథ్యంలో వీరిలో ఏ ఒక్కరు రెండుచోట్ల గెలిచినా తెలంగాణలో మళ్లీ ఉప ఎన్నికలు వస్తాయని అందరూ భావించారు. అనూహ్యంగా ముగ్గురిలో ఎవరూ రెండుచోట్ల గెలవలేదు. కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి విజయం సాధించారు. అక్కడ రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఇద్దరూ ఓటమి పాలయ్యారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి, గజ్వేల్‌లో కేసీఆర్ విజయం సాధించారు. బీజేపీ నుంచి హుజూరాబాద్, గజ్వేల్‌లో పోటీచేసిన ఈటల రాజేందర్ రెండుచోట్లా ఓటమి పాలయ్యారు. దీంతో ఈసారి రాష్ట్రంలో ఎక్కడా ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేకుండాపోయింది.